క్లుప్తంగా

కవి నల్లాకు అన్నమయ్య పురస్కారం

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తికి వాగ్గేయకారుడు అన్నమయ్య పురస్కారం లభించింది. చిత్తూరు సాంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ, తిరుపతి ఏఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళా సాహిత్య రంగాల్లో సేవలందిస్తున్న కవులు, సాహితీవేత్తలకు 2024 సంవత్సరానికి సంబంధించి ఈ పురస్కారాలు అందిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 116 మంది ప్రముఖులకు వాగ్గేయకారుడు అన్నమయ్య పేరిట ఈ పురస్కారాలు అందజేస్తోంది. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి గ్రామంలో ఈనెల 26న జరగనున్న పురస్కారాల ప్రదానోత్సవ సభలో కవి నల్లా పురస్కారాన్ని అందుకోనున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు కవి నల్లాను అభినందించారు.

ప్రాణాయామంపై విద్యార్థులకు శిక్షణ


విద్యార్థులకు ప్రాణాయామం నేర్పిస్తున్న యోగా గురువు ఆకుల శ్రీనివాస్

అమలాపురం టౌన్: స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రాణాయామంపై శిక్షణ ఇస్తున్నారు. వచ్చే నెల 7వ తేదీ వరకూ రోజూ ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకూ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి తెలిపారు. యోగాతో పాటు వివిధ క్రీడలు, క్రాఫ్ట్‌లోనూ ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వర్మ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆదిలక్ష్మి అమ్మవారి తీర్థం



ముమ్మిడివరం: మండలంలోని గాడిలంక గ్రామ దేవత శ్రీరాజ రాజేశ్వరి(ఆదిలక్ష్మి) అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర వైభవోపేతంగా జరిగింది. మంగళవారం నిర్వహించిన తీర్థానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గిరిగి సాయిరామ్, మహాదశ గంగాధరరావు, పెద్దిరెడ్డి మునీంద్రరావు, మహాదశ లక్ష్మీనారాయణ, తోట చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మురుగులమ్మ ఊరేగింపు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామ దేవత గంగాదేవి మురుగులమ్మ తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

రామ్‌మాధవ్‌ను కలిసిన కోనసీమ జేఏసీ ప్రతినిధులు


రామ్‌మాధవ్‌ను కలిసిన కోనసీమ జేఏసీ సభ్యులు

అమలాపురం రూరల్: కాకినాడలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి వారణాశి రామ్‌మాధవ్‌ను కోనసీమ జేఏసీ ప్రతినిధులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోటిపల్లి–నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.50 కోట్లు నిధులు విడుదల చేయడం, కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై ఆయనకు ధన్యవాదాలు తెలియచేశారు. రైల్వే లైన్ నిర్మాణ పనుల ప్రగతిని ఆయనకు వివరించారు. కోటిపల్లి నుంచి భట్నవెల్లి వరకూ, నర్సాపురం నుంచి దిండి వరకూ రైల్వేలైన్ అలైన్‌మెంట్ కోసం టెండరు ఖరారైందని చెప్పారు. రామ్‌మాధవ్‌ను కలిసినవారిలో జేఏసీ కన్వీనర్ బండారు రామమోహన్‌రావు, కోకన్వీనర్లు ఇళ్ల భక్తవత్సలం, మంత్రిప్రగడ వేణుగోపాల్, మంగళంపల్లి అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

ఆధార్ అనుసంధానం చేయాలి

యానాం: పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి నగదు బదిలీ ద్వారా సొమ్మును పొందడానికి లబ్ధిదారులు తమ ఆధార్ నెంబరును అనుసంధానం చేసుకోవాల్సి ఉందని ఆర్ఏఓ, పౌరసరఫరాల అధికారి మునిస్వామి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎల్‌పీజీ గ్యాస్, బియ్యం తదితర వాటికి ప్రభుత్వం నగదు బదిలీ చేస్తుందని, అయితే కొన్ని కుటుంబాల పేర్లు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో ఆధార్ అనుసంధానం చేయకోవడం వల్ల పథకాల ప్రయోజనం పొందలేకపోతున్నారన్నారు. అందుకే అలాంటి వారు తమ ఆధార్ జిరాక్స్‌ను పౌరసరఫరాల శాఖకు సమర్పించాలని కోరారు.

కళాత్మక రంగం.. ఉపాధికి మార్గం

- యానాం ప్రభుత్వ ఐటీఐలో ఫ్యాషన్ డిజైనింగ్‌పై శిక్షణ
- వస్త్రాల తయారీలో రాణిస్తున్న మహిళలు
- సాంకేతిక శిక్షణతో మెరుగవుతున్న అవకాశాలు


ప్రభుత్వ ఐటీఐలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సును అభ్యసిస్తున్న మహిళలు


శిక్షణా కాలంలో విద్యార్థులు డిజైన్ చేసిన వస్త్రాలు

యానాం: నేటి తరం యువత లైఫ్ స్టైల్‌లో ఫ్యాషన్ అనేది ఓ భాగం. తలపై పెట్టుకునే హ్యాట్ నుంచి పాదరక్షల వరకూ అన్నింటా ఫ్యాషన్ ఉట్టి పడాలనుకునే రోజులివి. అందుకే ఫ్యాషన్ ఇండస్ట్రీ రోజు రోజుకూ వృద్ధి చెందుతుంది. ఒకప్పుడు కేవలం డ్రెస్ డిజైన్‌కే పరిమితమైన ఫ్యాషన్ టెక్నాలజీ ఇప్పుడు హెయిర్ స్టైల్ నుంచి షూవేర్ వరకూ విస్తరించింది. యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ టెక్నాలజీ శాఖ కళాత్మక రంగంలో కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే వారికి చక్కని వేదికగా నిలుస్తుంది. వివిధ ఫ్యాషన్ డిజైనింగ్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా ఆసక్తి గలవారికి స్వయం ఉపాధికి మార్గాన్ని చూపిస్తుంది.

15 ఏళ్ల క్రితమే ఏర్పాటు

యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో 2009లోనే పుదుచ్చేరి కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ టెక్నాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఫ్యాషన్ డిజైనింగ్ నైపుణ్యాలను స్థానిక మహిళలకు నేర్పించి వారికి వృత్తిపర శిక్షణను అందించాలన్నది ముఖ్య ఉద్దేశం. వయసుతో నిమిత్తం లేకుండా పదో తరగతి పాసైన ఆసక్తి గల మహిళలు, యువతులకు శిక్షణనిచ్చి ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ టెక్నాలజీ ఎస్‌వీటీ సర్టిఫికెట్‌ను అందిస్తున్నారు. ఆధునిక ట్రెండ్స్‌ను బట్టి ఫ్యాషన్ డిజైనింగ్‌లో కీలకమైన కటింగ్, టైలరింగ్ వంటి ప్రాథమిక అంశాలతో పాటు ఎంబ్రాయిడరీ, స్కెచింగ్, యాక్సరీస్, డిజైనింగ్, డ్రెస్ డిజైనింగ్, బొటిక్స్ తదితర అంశాల్లో ఏడాది పాటు శిక్షణ సాగుతుంది. ముఖ్యంగా సిలబస్‌తో పాటు ఫ్యాషన్‌రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను నేర్పుతున్నారు. కోర్సులకు తగ్గట్లు మౌలిక సదుపాయాలు, ఆధునిక కుట్టుమెషీన్లు ఏర్పాటుచేశారు.

ఆకట్టుకుంటున్న డిజైన్‌లు

ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో ప్రవేశించాలనుకునే విద్యార్థులకు సృజనాత్మకత, కొత్త ట్రెండ్స్‌పై నిరంతర అవగాహన అవసరం. అంతేకాదు కేవలం థియరీతో నైపుణ్యాలు అందిపుచ్చుకోవడం సాధ్యం కాదు. అందుకే ఐటీఐలో చేరిన విద్యార్థులతో శిక్షణా కాలంలోనే వస్త్రాలు డిజైన్ చేసేలా ప్రోత్సహిస్తున్నారు. అంతేకాదు ఫ్యాషన్ డిజైనింగ్‌లో దేశవ్యాప్తంగా వస్తున్న మార్పులను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు కార్మిక శాఖ వివిధ ప్రాంతాలకు విద్యార్థులను పంపుతున్నారు. అలా ఇక్కడి విద్యార్థులు చెన్నైలోని అవడిలో ఉన్న మిలటరీకి చెందిన ఆర్డినెన్స్ క్లాతింగ్ ఫ్యాక్టరీ తదితర చోట్లకు వెళుతూ మెళకువలు నేర్చుకుంటున్నారు. శిక్షణా కాలంలో ఇక్కడి విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల వస్త్రాల డిజైన్‌లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ శిక్షణ పొందినవారిలో అనేక మంది చర్మాస్ వంటి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు దక్కించుకున్నారు. కొంతమంది స్వయం ఉపాధి దిశగా అడుగులేసి స్వయంగా బొటిక్స్ నడుపుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.


విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల బ్యాగ్‌లు

స్వయం ఉపాధి పొందుతున్నారు

కేంద్రపాలితప్రాంతం పుదుచ్చేరిలో మిగిలిన మూడు రీజియన్లలోనూ ఐటీఐల్లో ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ టెక్నాలజీ కోర్సు లేదు. యానాంలో మాత్రమే కార్మిక శాఖ ప్రారంభించింది. ఇక్కడ ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు విరివిగా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. కొందరైతే సొంతంగా బొటిక్స్ ప్రారంభించి స్వయం ఉపాధి పొందుతున్నారు.

– చింతపల్లి కృష్ణ సుధాకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ

సృజనాత్మకతను వెలికి తీస్తున్నాం

ఫ్యాషన్ డిజైనింగ్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంది. ఇక్కడ శిక్షణ పొందేందుకు వచ్చిన విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీస్తున్నాం. వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు కొత్త కొత్త డిజైన్లు రూపొందించేలా ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా విద్యార్థులు డిజైన్ చేసిన వినూత్న వస్త్రాలు, బ్యాగులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

– కర్రి అరుణకుమారి, ఇన్‌స్ట్రక్టర్, ప్రభుత్వ ఐటీఐ

మంత్రి విశ్వరూప్ పరామర్శ


మేషక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: పితృవియోగంతో బాధపడుతున్న అమలాపురం పీఆర్ డీఈఈ పీఎస్ రాజ్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల రాజ్‌కుమార్ తండ్రి పల్లి మేషక్ అనారోగ్యంతో మృతి చెందారు. కాకినాడలో ఉన్న డీఈఈ రాజ్‌కుమార్ సోదరులు, కుటుంబ సభ్యులను మంత్రి విశ్వరూప్ పరామర్శించి మేషక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్గోపాల్, ఏఎంజీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి తదితరులున్నారు.

బాలిక అదృశ్యంపై విచారణ

యానాం: నియోజకవర్గ పరిధిలో గతేడాది డిసెంబర్‌లో అదృశ్యమైన బాలికకు సంబంధించి ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్పీ రాజశేఖరన్ తదితరుల ఆధ్వర్యంలో మంగళవారం విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక నివాసం ఉంటున్న యూకేవీనగర్‌కు ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందం, శేరు నూకరాజు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోనూ స్థానికులను కలిసి విచారించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

మామిడికుదురు: ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని డీఆర్డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అజయ్ సూచించారు. మామిడికుదురు డీఆర్డీఏ కేంద్రంలో మంగళవారం సీసీఈ ఆదేశాల మేరకు రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సాయిబాబు అధ్యక్షతన అడ్మిషన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ జరిగింది. ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. తమ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, నల్లి రాజు, డాక్టర్ తోపే, బాలు, నాగరాజు పాల్గొన్నారు.

2న హనుమాన్ చాలీసా పారాయణ


మహాయజ్ఞం బ్రోచర్లను విడుదల చేస్తున్న యజ్ఞ నిర్వహణ సంస్థల ప్రతినిధులు

అమలాపురం టౌన్: హనుమంతుని జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 2వ తేదీన అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, దుర్గావాహిని, ధర్మ ప్రసార సంస్థల అమలాపురం శాఖల ప్రతినిధులు తెలిపారు. సాయిదత్త నాగానంద సరస్వతి, స్వామి సూర్య భాస్కరేంద్ర సరస్వతి స్వామీజీలు ముఖ్య అతిథులుగా హాజరై యజ్ఞాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఈ సందర్భంగా మహాయజ్ఞం బ్రోచర్లను స్థానిక సుభద్ర నర్సింగ్ హోమ్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన సన్నాహక సమావేశంలో విడుదల చేశారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ తదితర సంస్థల ప్రతినిధులు డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు, డాక్టర్ గోదశి గంగరాజు, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, బులుసు జగదీష్, రేలంగి కుమార్ శంకర్ గౌడ్, అంజనీ శ్రీనివాస్, కేవీ రమణ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది.

16 మోటారు సైకిళ్లు, ఒక ఆటో సీజ్

కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిన పోలీసులు


స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లతో ఎస్ఐ హరీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది

అల్లవరం: డీఎస్పీ మహేశ్వరరావు పర్యవేక్షణలో సీఐ వీరబాబు ఆధ్వర్యంలో బోడసకుర్రు టిడ్కో భవనాల సముదాయంలో అల్లవరం ఎస్ఐ హరీష్ కుమార్ మంగళవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో డాక్యుమెంట్లు లేని 16 మోటారు సైకిళ్లు, ఒక ఆటోని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టిడ్కో భవనాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాట్లలో నివాసముంటున్న వారికి అవగాహన కల్పించారు. జూన్ 4 వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సోషల్ మీడియా ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టిడ్కో భవనాల సముదాయంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఖరీఫ్‌కు రైతులను సన్నద్ధం చేయాలి


పంటకోత ప్రయోగ కిట్లు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

రాజోలు: రానున్న ఖరీఫ్ సాగుకు రైతులను సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. మంగళవారం సోంపల్లి గ్రామ ఆర్బీకే వద్ద రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. 2024 ఏడాదికి సంబంధించి ఖరీఫ్ సాగు ముందస్తు కార్యాచరణపై అవగాహన సదస్సు జరిగింది. ఖరీఫ్ సాగును రైతులు ఉత్సాహంగా చేపట్టేందుకు వ్యవసాయశాఖ పూర్తి స్థాయిలో సహకారాన్ని అందించాలన్నారు. ఆర్బీకేల్లో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి పంటకోత ప్రయోగాలకు సంబంధించిన కిట్లను బోసుబాబు పంపిణీ చేశారు. డీఆర్సీ ఏడీఏ రాజశేఖర్, ఏడీఏ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలి


అంబాజీపేటలో మాట్లాడుతున్న ఏడీఏ రామమోహనరావు

అంబాజీపేట: ఖరీఫ్ పంటకు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు చెప్పారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్ఏలకు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ పంటలో స్వర్ణ, ఎంటీయూ 1064, 1318 వరి రకాలకు కిలోకు రూ.5 వంతున ప్రభుత్వం రాయితీని ఇస్తుందన్నారు. ఈ విషయాన్ని రైతులకు వివరించి వారికి అవసరమైన వరి విత్తనాలను ఆర్బీకేల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. వరి విత్తనాలతో పాటు ఎరువులు స్టాక్ సిద్ధం చేసుకోవాలన్నారు. వరి విత్తనాల విషయంలో ఎవరూ అలసత్వం వహించవద్దన్నారు. అనంతరం పంట కోత ప్రయోగాలకు సంబంధించి కిట్‌లను వీఏఏ, వీహెచ్ఏలకు అందజేశారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారులు సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఎ.కల్యాన్ సూర్యకుమార్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించండి

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండి, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ సూచించారు. పెదపట్నంలంక, అప్పనపల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామ పెద్దలు, యువతతో నిర్వహించిన ముందస్తు సమావేశాల్లో సీఐ మాట్లాడారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, కౌంటింగ్ తరువాత కూడా వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారన్నారు.

గోగన్నమఠంలో అగ్ని ప్రమాదం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన రెండెకరాల విస్తీర్ణంలో ఉన్నత చెత్త అంటుకుని మంగళవారం భారీగా మంటలు లేచాయి. ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి గేట్లు ఉండడం వల్ల స్థలం లోపలి భాగంలో ఏం జరిగిందన్న విషయం తెలియక స్థానికులు ఆందోళన చెందారు. రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఖాళీ ప్రదేశంలో కొబ్బరి చెత్తతో పాటు పశుగ్రాసం కాలిపోయాయని, పెద్దగా ఆస్తి నష్టం ఏమీ జరగలేదని రాజోలు అగ్నిమాపక కేంద్రం ఉద్యోగులు తెలిపారు.

బుద్ధ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న డీబీ లోక్

అమలాపురం రూరల్: స్థానిక త్రిరత్న బుద్ధ విహార్‌లో గురువారం జరిగే 2568వ బుద్ధ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు త్రిరత్న బుద్ధ విహార్ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ తెలిపారు. మంగళవారం జరిగిన కమిటీ సమావేశంలో డీబీ లోక్ మాట్లాడుతూ 23 తేదీ ఉదయం 9 గంటలకు బుద్ధ విహార్‌లో బౌద్ధ భిక్షువులచే ప్రార్థన, 10 గంటల నుంచి బుద్ధుని ప్రతిమతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమలాపురం అంబేడ్కర్ భవన్ వరకూ పురవీధుల మీదుగా ఊరేగింపు ఉంటుందన్నారు. అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు రాంబోది కాశి, ప్రధాన కార్యదర్శి ఈవీవీ సత్యనారాయణ, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ల అక్కమ్మకి గండ దీపాల సమర్పణ


ఆర్ల అక్కమ్మకి గండ దీపాలను సమర్పిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులో కొలువైన ఆర్ల అక్కమ్మవారికి మంగళవారం ఘనంగా తీర్థ మహోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో కనుల విందుగా అలంకరించారు. అమ్మవారిని జిల్లా వ్యాప్తంగా వేలాది భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి గండ దీపాలు, దండుగమ్మ కావళ్లు, కానుకలు, మొక్కులు చెల్లించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ఆర్ల అక్కమ్మవారు ప్రసిద్ధి కెక్కారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు కానుకలు, మొక్కులు చెల్లించారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి


రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కాంగ్రెస్ నేతలు

యానాం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రాజీవ్ రివర్ బీచ్ వద్ద నున్న రాజీవ్ విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశంలో ఆధునిక సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ మురుగానందం, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాక్రమంలో ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ ప్రధాన కార్యదర్శి మాచవరపు శివన్నారాయణ, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని స్థానిక బుద్ధ పార్కులో ఘనంగా నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు పి.ఉదయ భాస్కరవర్మ, వడ్డి నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి



ఆలమూరులో ప్రైవేట్, కార్పొరేట్ అక్రమాలపై ప్రసంగిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఆలమూరు: ప్రతిష్టాత్మక విద్యాహక్కు చట్టాన్ని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు దుర్వినియోగం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. స్థానిక సమత కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల అక్రమ దోపిడీ నియంత్రణపై మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ వెంకట్ పాల్గొని ప్రసంగించారు. కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ల కోసం ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ధనార్జనే ధ్యేయంగా అడ్మిషన్లను పొందుతున్నారన్నారు. ఈ క్రమంలో విద్య హక్కు చట్టాలను గాని, ప్రభుత్వ నియమ నిబంధనలను గానీ ఏమాత్రం పట్టించుకోకుండా తమ ప్రైవేట్ పాఠశాలల్లోనే మంచి విద్యాబోధన దొరుకుతుందని ఇంటింటికీ తిరుగుతూ అబద్ధ ప్రచారం చేస్తున్నారన్నారు. వేసవి సెలవుల అనంతరం నిర్వహించాల్సిన అడ్మిషన్లు ఇప్పుడే ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు కళ్లు తెరచి ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలతో ప్రైవేట్ పాఠశాలల వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాలు విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించి అధిక ఫీజులతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని, ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టిసారించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సతీష్, సాయిరామ్, కుమార్, నూకన్న ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం ఘటనపై విచారణ చేయాలి


ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న ముత్యాల శ్రీనివాసరావు

మలికిపురం: మండలంలోని గోగన్నమఠం గ్రామానికి చెందిన కోరుకొండ రాజ్‌కుమార్ కిడ్నాప్, హత్యాయత్నంపై సమగ్ర దర్యాప్తు చేసి, నిందితులందరిని అరెస్టు చేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి తూర్పు జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం రాజోలు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు రాజ్ కుమార్‌ను కలిసి విషయ సేకరణ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మే 14న మధ్యాహ్నం 3 గంటలకు కొంత మంది వ్యక్తులు కిడ్నాప్ చేసి, నోటిలో గుడ్డలు కుక్కి కేశనపల్లి బీచ్‌కు తీసుకువెళ్లి విచక్షణారహితంగా సరుగుడు కర్రలతో కొట్టి చంపాలని ప్రయత్నం చేశారని శ్రీనివాస్ ఆరోపించారు. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మీ అబ్బాయిని విడిచి పెట్టాలంటే రూ.50 వేలు ఇవ్వాలని, లేకుంటే చంపేస్తామని డిమాండ్ చేశారని, గత్యంతరం లేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు భయపడి రూ.20 వేలు మలికిపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మొబైల్‌కు ఫోన్ పే చేసినట్టు బాధితుడు చెప్పాడని ఆయన వివరించారు. ఈ ఘటనలో పది మంది వరకు పాల్గొన్నారని అన్నారు. తీవ్ర గాయాలతో ఉన్న రాజకుమార్‌ను కుటుంబ సభ్యులు మే 15న రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేశారని చెప్పారు. ఈ కిడ్నాప్, హత్యాయత్నం కేసులో కొంతమంది నిందితులను తప్పించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని రాజ్‌కుమార్ ఆరోపిస్తున్నాడు. దీనిపై సమగ్ర విచారణ చేసి, నిందితులందరిని అరెస్టు చేయాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది.

23న కల్యాణ మహోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని సవరప్పాలెంలో వేంచేసియున్న సత్తి కుటుంబీకుల ఇలవేల్పు రమా సత్యనారాయణ స్వామి, అంబికా విశ్వేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఈ నెల 23 తేదీ గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు.